సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం ꞉ 3 ꞉ ఫిబ్రవరి ꞉ 2023



ఆరుద్ర నక్షత్రోత్సవ పూజలు

వేములవాడ: రాజన్న ఆలయంలో గురువారం ఆరుద్ర నక్షత్ర పూజలు నిర్వహించారు. రాజన్నకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు నిర్వహించారు.



న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

సిరిసిల్లక్రైం: ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ప్రేమలతను ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తిని కలిసి మొక్కను అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం

30.0/14.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఘనంగా పునఃప్రతిష్ఠ వేడుకలు



యాగశాల ప్రవేశంతో పూజలు చేస్తున్న దృశ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం మద్దికుంట శ్రీమెట్టు రాజరాజేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలను గురువారం ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు పురాతన ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నదానం చేశారు. ఆర్‌బీఎస్ మండలాధ్యక్షుడు గోపాల్‌రావు, గోద అంజిబాబు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రాజేశంగౌడ్, రాజమౌళి, కదిరె స్వామి, శ్రీనివాస్, తిరుపతి, వేణు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి

వేములవాడ: వేములవాడ డివిజన్ పరిధిలోని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ ధర్నాకు పేదలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. నిరుపేదలు అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బంది పడుతున్నారన్నారు. స్థలాలు ఉన్న వారికి గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుర్రం అశోక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షక్ష కార్యదర్శులు రామంచ అశోక్, ముక్తికాంత అశోక్ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల కనీస వేతనం అమలు చేయాలి



ముస్తాబాద్‌లో చలో హైదరాబాద్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

ముస్తాబాద్(సిరిసిల్ల): బీడీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని భారతీయ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ కోరారు. ముస్తాబాద్ దేశాయి బీడీ కంపెనీలో కార్మికులతో గురువారం సమావేశమయ్యారు. ధర్మేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో బీడీ కార్మికుల బతుకులు మారతాయని చెప్పిన కేసీఆర్.. సీఎం అయ్యాక కార్మికులకు కనీస వేతనాలు ఇప్పించలేకపోతున్నారన్నారు. ఈనెల 14న హైదరాబాద్‌లో తలపెట్టిన చలో హైదరాబాద్‌కు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. చంద్రమౌళి, మచ్చ ప్రవీణ్, తడుక ప్రభాకర్, నరేశ్, కొంక రాజు, శ్రీనివాస్, నరేశ్, సకినాల పద్మ, లత పాల్గొన్నారు.

నిద్రలేమితో మానసిక సమస్యలు



మాట్లాడుతున్న పున్నంచందర్

సిరిసిల్ల: నిద్రలేమితో మానసిక సమస్యలు ఎదురవుతాయని ప్రముఖ సైకాలజిస్ట్ పున్నం చందర్ పేర్కొన్నారు. సిరిసిల్ల కార్మికక్షేత్రంలోని గణేశ్‌నగర్‌లో గురువారం నేతకార్మికులకు సామూహిక కౌన్సెలింగ్ నిర్వహించారు. పున్నం చందర్ మాట్లాడుతూ మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించుకోవాలన్నారు. దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. నిద్రలేమి, భయం, నిరాశ, నిస్పృహలు, ఆందోళన, దురలవాట్లు, ప్రతికూల ఆలోచనలు మానసిక సమస్యలకు సూచికలు అని స్పష్టం చేశారు. సమస్యలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలోని మనోవికాస కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. మనోవికాస కేంద్రం సిబ్బంది వేముల అన్నపూర్ణ, కొండ ఉమ, బూర శ్రీమతి, రాపెల్లి లత పాల్గొన్నారు.

పొలాలు ఎండిపోతున్నాయి

- వేళాపాళా లేకుండా కరెంట్ కోతలు
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆందోళన
- వ్యవసాయానికి 14 గంటలు ఇస్తున్నాం
- ‘సెస్’ చైర్మన్ చిక్కాల రామారావు
- అధికారులు పర్యటనల సమాచారం ప్రజాప్రతినిధులకు ఇవ్వాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ





మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

సిరిసిల్ల: జిల్లాలో విద్యుత్ కోతలు రైతులకు ఇబ్బందిగా మారాయని, వేళాపాళా లేకుండా కోతలు విధిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్‌లో గురువారం జెడ్పీ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన జరిగింది. రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య మాట్లాడుతూ వేళాపాళా లేని విద్యుత్ కోతలతో వరి పొలాలు తడారి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి ఇచ్చే కరెంట్ సమయపాలన పాటించాలని కోరారు. ‘సెస్’ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కరెంట్ సరఫరా జరిగిందని, ఇప్పుడు యాసంగిలో గ్రిడ్‌లో సమస్యలు ఉన్నప్పటికీ జిల్లాలో ఏడు గంటలు ఒక్కసారి, ఆరు గంటలు మరోసారి ఇస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరా వేళలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అధికారులు మండలాల పర్యటనకు వచ్చినప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని కోనరావుపేట ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అంశంతో పలువురు సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కల్పించుకొని.. జిల్లా అధికారులు ఎక్కడికి వెళ్లినా స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గతంలో చెప్పినా అధికారులు మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై సమాచారం ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందించాలనే నిబంధన అమలుకావడం లేదని జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలకు కులధ్రువీకరణ పత్రాలు ఇస్తే.. అమలు చేస్తామని ‘సెస్’ అధికారులు స్పష్టం చేశారు. తమకు సమాచారం లేకుండానే కోనరావుపేట మండలంలో రూ.5కోట్ల రోడ్డు పనులు జరుగుతున్నాయని ఎంపీపీ చంద్రయ్యగౌడ్ ఆరోపించారు.

నీటి సమస్యలు రానీయొద్దు

వేసవిలో నీటి సమస్యలు రాకుండా అధికారులు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ కోరారు. క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి వేసవికి ముందే పరిష్కరించాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులు అన్ని మండలాల్లో పర్యటించి నివేదిక రూపొందించాలన్నారు. వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో కంటి వెలుగు –2లో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. రైతులు వరిపంటనే కాకుండా ఇతర పంటను సాగు చేసేలా బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించాలని కోరారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, పశువైద్యం, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఎస్సీ అభివృద్ధి, బీసీ అభివృద్ధి, సంక్షేమం, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్, ఇంజినీరింగ్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు నివేదికలు సమర్పించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన ‘సెస్’ చైర్మన్ చిక్కాల రామారావును జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ సన్మానించారు.

నాణ్యమైన విద్యుత్ అందజేస్తాం



నాలుగైదు రోజులుగా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. అన్ని మండలాల్లో నాణ్యమైన విద్యుత్ అందజేస్తాం. వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా చూస్తాం. రైతులకు ఏ సమస్య రానీయం. – చిక్కాల రామారావు, సెస్ చైర్మన్

టీచర్లను తగ్గించొద్దు



చిన్న గ్రామపంచాయతీల్లోని పాఠశాలల్లో టీచర్లను తగ్గించొద్దు. టీచర్ల ప్రమోషన్లలో భాగంగా ఉన్న వారిని తొలగిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడతారు. మిషన్ భగీరథ నీటిసరఫరాలో ఇబ్బందులు ఉన్నాయి. – గంగం స్వరూపారాణి, రుద్రంగి ఎంపీపీ

సమాచారం ఇవ్వాలి



స్థానిక ప్రజాప్రతినిధులకు తెల్వకుండా జిల్లా అధికారులు మండలాల్లో పర్యటిస్తున్నారు. ముందుగా సమాచారం ఇస్తే.. మేము కూడా భాగస్వాములమవుతాం. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన వారికి రూ.10లక్షలు మంజూరు చేసిన విషయం తెలియదు. గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించాలి. – పూర్మాణి మంజుల, తంగళ్లపల్లి జెడ్పీటీసీ

నీటి సమస్యలు పరిష్కరించాలి



ఎల్లారెడ్డిపేట మండలంలో మిషన్ భగీరథ నీరు సరిగ్గా సరఫరా కావడం లేదు. సమస్యను త్వరగా పరిష్కరించాలి. మండల, జెడ్పీ సమావేశాల్లో చాలాసార్లు ఇదే సమస్యపై చర్చించిన ఎవరూ పట్టించుకోవడం లేదు. వచ్చేది ఎండాకాలం తొందరగా సమస్యలు పరిష్కరించి నీటి సరఫరా చేయాలి. – పిల్లి రేణుక, ఎల్లారెడ్డిపేట ఎంపీపీ

వేగంగా రైల్వేలైన్ భూసేకరణ

- కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్‌కు 804 ఎకరాల భూసేకరణ
- డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణ వేగంగా పూర్తి చేస్తున్నామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ చెందిన ఉన్నతాధికారులు అధికారులు భూసేకరణ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణానికి 946 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండా.. ఇప్పటికే 804 ఎకరాలు సేకరించామన్నారు. తంగళ్లపల్లి మండలం తాడూరు వద్ద రైల్వేలైన్, రైల్వేస్టేషన్ నిర్మాణాలకు భూసేకరణ పూర్తయిందన్నారు. వేములవాడ మండలం నాంపల్లి వద్ద భూసేకరణ పనులు ప్రగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. భూసేకరణను వేగంగా పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. ఇన్‌చార్జి డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, జిల్లా పరిశ్రమలశాఖ జీఎం ఉపేందర్‌రావు, పర్యవేక్షకులు రమేశ్ పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లను పూర్తి చేయాలి

జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం సిరిసిల్ల నియోజకవర్గంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్, వీర్నపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఇళ్ల నిర్మాణలను వేగంగా పూర్తి చేయాలన్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి 4,429 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరుకాగా.. ఇప్పటికే 3,178 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. ఇంకా కొన్ని ఇళ్లు వివిధ దశల్లో ప్రగతిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. మంజూరైనా కూడా పనులు ప్రారంభించని ప్రాంతాల్లో వెంటనే పనులు చేపట్టాలని, లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఇన్‌చార్జి డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఈఈ విరూపాక్ష, మిషన్ భగీరథ(ఇంట్రా) ఈఈ జానకి, ఏఈ భాస్కర్ పాల్గొన్నారు.

అన్యాయం చేయకండి



భూములను పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని లింగంపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌లో భూములు కోల్పోతున్న రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. చెక్‌డ్యామ్ నిర్మించే స్థల పరిశీలన ఇరిగేషన్ అధికారులు బుధవారం వచ్చారన్న విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకున్నారు. చెక్‌డ్యామ్ నిర్మాణంతో దాదాపు 10 మంది రైతులం భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములు పోకుండా న్యాయం చేయాలని గ్రామానికి చెందిన రాములు, శ్రీనివాస్, చంద్రగిరి శ్రీకాంత్, గొల్లపల్లి రాజు, శ్రీనివాస్ అధికారులకు విన్నవించారు. ఈఈ అమరేందర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్, సామ తిరుపతిరెడ్డి పరిశీలించారు.

8న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్న హుండీ లెక్కింపును ఈనెల 8న చేపడుతున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఉత్తర్వులు వెలువరించారు.

ఉపాధిహామీ నిధులు పక్కదారి



రామారావుపల్లెలో జరిగిన ఉపాధిహామీ పనుల అక్రమాలపై అధికారులకు వివరిస్తున్న డీఆర్పీలు

- డబ్బుల రికవరీకి ఆదేశాలు

చందుర్తి(వేములవాడ): మండలంలో ఉపాధిహామీ పథకంలో నిధులు పక్కదారి పట్టాయి. క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డట్లు నివేదికలు తెలుపుతున్నాయి. స్థానిక మండల పరిషత్ ఆవరణలో గురువారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 19 పంచాయతీల్లో ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనులపై ప్రజావేదిక నిర్వహించారు. 2019 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు రూ.13.87 కోట్ల పనులు చేపట్టారు. ఈ పనులపై పది ఆడిట్ బృందాలు గత పది రోజులుగా గ్రామాల్లో తనిఖీలు చేపట్టి, గ్రామసభలు నిర్వహించాయి. 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో గురువారం సాయంత్రం వరకు 12 గ్రామాల నివేదిక చదవడం పూర్తయ్యింది. మండలంలోని నర్సింగాపూర్, రామరావుపల్లి, మర్రిగడ్డ, జోగాపూర్ గ్రామాల్లో ఉపాధిహామీ నిధులు పక్కదారి పట్టినట్లు తేలింది. మిగతా గ్రామాల్లోనూ నివేదిక పూర్తయిన తర్వాత ఏయే గ్రామాల్లో ఎంత సొమ్ము రికవరీకి చేపట్టనున్నట్లు నివేదికను అందజేస్తామని అధికారులు తెలిపారు. అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్, ఏపీడీ నర్సింహులు, విజిలెన్స్ అధికారి రామారావు, ఎంపీడీవో పత్తి రవీందర్, ఏపీవోలు ములక అరుణ, రాజయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కల సాకారమవుతున్న వేళ !

- పోడురైతులకు హక్కుపత్రాలు
- పత్రాల పంపిణీకి పోడు కమిటీ కసరత్తు
- 6,017 మంది నుంచి దరఖాస్తులు
- కొలిక్కివచ్చిన అర్హుల జాబితా

జిల్లాలో భూముల వివరాలు

అటవీ విస్తీర్ణం : 39 వేలు
అడవుల పరిధి : 385.57 కి.మీ.
పోడు దరఖాస్తులు : 6,017
అటవీశాఖ పరిధిలోని భూములు : 47,517 ఎకరాలు
రెవెన్యూ పరిధిలోని భూములు : 1,33,190 ఎకరాలు
ఇప్పటి వరకు పంపిణీ చేసిన భూములు(అటవీశాఖ) : 723 ఎకరాలు
ఇప్పటి వరకు పంపిణీ చేసిన భూములు (రెవెన్యూశాఖ) : 40,420 ఎకరాలు
సాగుచేసుకుంటున్న లబ్ధిదారులు : 16,304
సాగుచేసుకుంటున్న భూములు : 21 వేల ఎకరాలు



ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగుండారంలో క్షేత్రస్థాయిలో భూములను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పోడురైతుల దశాబ్దాల కల నెరవేరనుంది. పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర రైతులకు పోడుహక్కులు దక్కనున్నాయి. పది రోజుల్లోగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో మంత్రి కేటీఆర్ లాంఛనంగా పోడురైతులకు హక్కుపత్రాలు ఇవ్వనున్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో పోడుకమిటీ సమావేశమై హక్కుపత్రాలు ఇవ్వడానికి నిర్ణయించారు. కమిటీ నిర్ణయంపై పోడురైతుల నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

6,017 దరఖాస్తులు

- రాష్ట్ర ప్రభుత్వం పోడురైతులకు హక్కుపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు కొన్ని నిబంధనలు పెట్టింది. 2005 కంటే ముందు గిరిజనులు, మూడు తరాల కంటే ముందు గిరిజనేతరులు అటవీభూమిని సాగుచేసుకుంటున్నట్లు ఆధారాలు చూపిస్తే హక్కుపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది.
- క్షేత్రస్థాయిలో పోడురైతులను గుర్తించేందుకు గ్రామాలలో పోడుకమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలోని సభ్యులు స్థానికులే. వీరితోనే పోడుచేసుకుంటున్న రైతులను ప్రభుత్వం గుర్తించాలని నిర్ణయించింది.
- జిల్లాలో అటవీభూములపై హక్కుపత్రాలు పొందడానికి సాగుచేసుకుంటున్న 6,017 మంది రైతులు ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నారు.
- జిల్లాలో వచ్చిన దరఖాస్తులలో 210 మంది రైతులు భూమి లేనప్పటికీ దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు.
- దరఖాస్తులను, పోడుభూముల్లోకి వెళ్లి కమిటీ సభ్యులు ఇప్పటికే అర్హులను గుర్తించి నివేదికను జిల్లా పోడుకమిటీకి సమర్పించారు.
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిటీలో ఆర్డీవోతోపాటు గ్రామ కమిటీ సభ్యులు, అటవీశాఖ అధికారులు ఉన్నారు. ఈ కమిటీ పరిశీలించి.. భూముల హద్దులు, సాగుచేసుకుంటున్న రైతుల వివరాలు సేకరించింది.
- జిల్లా పోడుకమిటీ సభ్యులు బుధవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశమందిరంలో సమావేశమయ్యారు. దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేశారు.

దశలవారీగా హక్కుపత్రాలు

పోడుభూములు సాగుచేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం దశలవారీగా హక్కుపత్రాలు ఇవ్వడానికి నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే జిల్లా అధికారులు జాబితాను సిద్ధం చేసి ఉంచారు. జిల్లాలో అత్యధికంగా వీర్నపల్లి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి మండలాల్లో పోడురైతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తక్కువగా గంభీరావుపేట, ముస్తాబాద్, చందుర్తి, తంగళ్లపల్లి మండలాల్లో పోడురైతులు ఉన్నట్లు అధికారులు గుర్తించి.. జాబితాను సిద్ధం చేశారు. అధికారులు జాబితాను మంత్రి కేటీఆర్‌కు అందించగానే పది రోజుల్లోగా మొదటిదశలో కొంతమందికి పోడుహక్కు పత్రాలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



దశాబ్దాల కాలంగా పోడుభూములను సాగుచేసుకుంటున్న రైతులకు హక్కుపత్రాలు ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయం. పోడుభూములను సాగుచేసుకుంటూ కేసుల పాలు కావడమే కాకుండా... అనేక ఇబ్బందులు పడ్డారు. దరఖాస్తుదారులందరికీ పోడు హక్కు పత్రాలు ఇచ్చి న్యాయం చేయాలి.

– మల్లారపు అరుణ్‌కుమార్, ప్రజాసంఘాల ప్రతినిధి

పది రోజుల్లో హక్కుపత్రాలు



దరఖాస్తు చేసుకున్న పోడురైతుల జాబితాను కమిటీ పరిశీలించింది. పలు సమావేశాలు జరిపి అర్హులను గుర్తించాం. మంత్రి కేటీఆర్ సమయం ఇవ్వగానే పది రోజుల్లోగా హక్కుపత్రాలు అందజేస్తాం. దశలవారీగా అందరికీ న్యాయం జరుగుతుంది. ఎవరూ ఆందోళనకు గురికావద్దు. అందరికీ ప్రభుత్వం హక్కుపత్రాలు అందిస్తుంది. – చీటి లక్ష్మణ్‌రావు, జిల్లా పోడుకమిటీ సభ్యుడు

క్లుప్తంగా

రాజన్న సేవలో మాజీ విప్



మోహన్‌ను సన్మానిస్తున్న ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్

వేములవాడ: వేములవాడ రాజన్నను మాజీ విప్ ఆరెపల్లి మోహన్ గురువారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం పర్యవేక్షకులు అల్లి శంకర్ ఆధ్వర్యంలో వేదోక్త ఆశీర్వచనం గావించారు.

కందికట్కూర్‌లో సెస్ ప్రతినిధుల ఎన్నిక బహిష్కరణ

ఇల్లంతకుంట(మానకొండూరు): మండలంలోని కందికట్కూర్‌లో గ్రామ సెస్ ప్రతినిధుల ఎన్నికను గ్రామస్తులు బహిష్కరించారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సెస్ సంస్థ హెల్పర్‌ను నియమించకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హెలప్ర్‌ను నియమించాకే సెస్ ప్రతినిధులను ఎన్నిక చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

ఫిట్‌నెస్ లేని బస్సులతో ప్రమాదాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని వాహనాలు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని బీజేవైఎం మండల అధ్యక్షుడు మెరుగు జితేందర్‌రెడ్డి ఆరోపించారు. ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారనని, అయినా విద్యాశాఖ అధికారులు పాఠశాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బస్సులో పరిమితికి మించి విద్యార్థులను తరలించడం, ఫిట్‌నెస్ లేకపోవడం ప్రమాదానికి కారణమన్నారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాలకృష్ణ, కార్తీక్‌రెడ్డి, మానుక రాజు, అరవింద్, సురేశ్, కిరణ్, రవీందర్ ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



తంగళ్లపల్లి పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట శివారులోని మానేరువాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తంగళ్లపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువ జోరు.. పరుగుల హోరు..






సీనియర్స్ విభాగంలో ఫైనల్‌కు చేరిన వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు, హోరాహోరీగా తలపడుతున్న జట్లు, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

- ఎస్పీఎల్ సీజన్–4లో తొలి అర్ధసెంచరీ నమోదు
- రెండో రోజు పోటీలను ప్రారంభించిన డీటీసీ చంద్రశేఖర్ గౌడ్
- సీనియర్స్ ఫైనల్‌లో వాగ్దేవి కళాశాల, మంచిర్యాల

కరీంనగర్‌స్పోర్ట్స్: అసలు క్రికెట్ పోరు అంటే ఇదేనేమో.. ఓ వైపు సిక్సర్‌ల మోత.. మరోవైపు బౌండరీల బాదుడు.. ఇలా మైదానం మొత్తం పరుగుల వరదను పారిస్తుంటే ప్రేక్షకులు, తోటి క్రీడాకారుల కేకలు, ఈలల మధ్య 'సాక్షి' ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా, హోరాహోరీగా సాగాయి. ఈ సీజన్‌లో తొలి అర్థ సెంచరీని వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి నమోదు చేశాడు. నేడు సీనియర్స్ సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్..

క్రీడలతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, క్రీడల్లో రాణించినట్లే విద్యలోనూ రాణించాలని ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారి మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. ఎస్పీఎల్ రెండో రోజు పోటీలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, కరీంనగర్ బ్యూరో చీఫ్ బాషబోయిన అనిల్ కుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాసరావు, సాక్షి సిబ్బంది సిలివేరి మహేందర్, రాకేష్, పరుషరాం, జ్యోతిష్మతి కళాశాల పీడీ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ విశ్వప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



అర్ధసెంచరీ చేసిన నిఖిల్ సాయి

తొలి అర్ధసెంచరీ నమోదు

వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి ట్రినిటీ కళాశాలతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కేవలం 24 బంతుల్లో 4 సిక్స్‌లు, 6 ఫోర్లతో 51 పరుగులు చేసి అర్ధసెంచరీని నమోదు చేశాడు. అదే కళాశాలకు చెందిన సాయి కృష్ణారెడ్డి 21 బంతుల్లో 3 సిక్స్‌లు, 6 ఫోర్లతో 46 పరుగులు చేయగా.. సెమీస్‌లో 18 బంతుల్లో ఒక సిక్స్, 4 ఫోర్లతో 34 పరుగులు చేశారు. అశ్వక్ 3 వికెట్లు, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నౌమాన్ 10 బంతుల్లో 3 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 25 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీశాడు.

రెండో రోజు ఫలితాలు

- జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్, ఎస్సారార్ కళాశాల కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎస్సారార్ కళాశాల 51 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌లో ప్రవేశించింది. జట్టులో అల్సీ, నవీన్ రాణించారు
- జేఎన్‌టీయూ మంథని, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీ చైతన్య జట్టు 32 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. జట్టులో నౌమాన్, అరవింద్ రాణించారు.
- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల పెద్దపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వాగ్దేవి జట్టు 70 పరుగులు భారీ విజయాన్ని నమోదు చేసింది. జట్టులో నిఖిల్ సాయి, సాయికృష్ణారెడ్డి రాణించారు.

- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసి సీనియర్స్ విభాగంలో ఫైనల్‌లో ప్రవేశించింది.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గుండారం గ్రామానికి చెందిన మైదంపల్లి రాజమ్మ(85) గురువారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. రాజమ్మ కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతోంది. ఈక్రమంలో గ్రామ శివారులోని వారి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లింది. బావి వద్ద తిరుగుతుండగా కాలుజారి అందులో పడిపోయింది. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఎల్లారావు గతంలోనే అనారోగ్యంతో మరణించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి టి.శ్రీనివాస్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో 5 నుంచి ఇంటర్ ఫస్టియర్, వేములవాడలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ ఎంఎల్‌టీ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ వృత్తి విద్యాకోర్సులకు ఈనెల 15లోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు బాలికల కోసం 733117865, బాలుర కోసం 93466 77568లలో సంప్రదించాలని తెలిపారు.

3,867 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: జిల్లా వ్యాప్తంగా గురువారం కంటి వెలుగులో 3,867 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. 751 మందికి రీడింగ్ అద్దాలు, 435 మందికి పాయింట్ గ్లాసులను అందించారు. మొత్తం 26 క్యాంపుల్లో 234 మంది సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా !

- తరలిపోతున్న వరదకాల్వ మట్టి
- యథేచ్ఛగా అక్రమ మట్టి రవాణా
- నిద్రపోతున్న ఇరిగేషన్ శాఖ
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. వరదకాల్వ మట్టిని సైతం వదలడం లేదు. కట్టలు తవ్వుతూ మట్టిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డూ అదుపు లేకుండా మట్టి అక్రమ రవాణా సాగుతోంది. అక్రమ మట్టి రవాణాను అరికట్టాల్సిన ఇరిగేషన్‌శాఖ అధికారులు నిద్రమత్తు వీడడం లేదు. అడపాదడపా రెవెన్యూ, పోలీస్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నా.. అక్రమ మట్టి రవాణా నిలిచిపోవడం లేదు.

20 కిలోమీటర్ల పరిధిలో కాల్వ..

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా వరదకాల్వను నిర్మించారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం షానగర్, లక్ష్మీపూర్ పరిసరాల నుంచి గంగాధర మండలం కురిక్యాల, గర్శకుర్తి మీదుగా బోయినపల్లి మండలం విలాసాగర్, మర్లపేట, దేశాయిపల్లి, జగ్గారావుపల్లి మీదుగా వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు దాదాపు 20 కిలోమీటర్ల పొడవు వరదకాల్వ విస్తరించింది. వరదకాల్వ వంద మీటర్ల వెడల్పు, సుమారు 20 మీటర్ల లోతు ఉంటుంది. వరదకాల్వ కోసం తవ్వగా వెలువడ్డ మట్టిని పక్కనే 20 మీటర్ల ఎత్తులో కట్టలుగా పోశారు.



ఖాళీ అయిన వెంకట్రావుపల్లి ఉపకాల్వ కట్టలు



కట్ట మట్టి తొలగిస్తున్న జేసీబీ

ఖాళీగా వరదకాలువ కట్టలు

పలు చోట్ల వరదకాల్వ కట్టల మట్టి ఆనవాళ్లుగా మిగిలిపోయాయి. ఫ్యాక్టరీల నిర్మాణాల బేస్‌మెంట్, రోడ్ల ఫార్మేషన్, వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చేందుకు ఇలా అవసరం ఏదైన వరదకాల్వ మట్టి తరలిపోతోంది. జేసీబీలతో తవ్వుతూ ట్రాక్టర్‌లు, టిప్పర్‌ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. కొద్ది నెలల క్రితం అనుమతుల పేరుతో వెంకట్రావుపల్లి ఉపకాల్వ కట్ట మట్టిని ఫోర్‌లేన్ రోడ్డు కోసం పెద్ద మొత్తంలో వాడినట్లు సమాచారం. ఓ ఫ్యాక్టరీకి మట్టి తరలింపు గతంలో వివాదాస్పదమైంది. ఆ సమయంలో తహసీల్దార్ దర్పెల్లి నరేశ్ జేసీబీ, ట్రాక్టర్‌లను సీజ్ చేశారు. ఇటీవల జగ్గారావుపల్లి కట్ట పరిసరాల్లో మట్టి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను, జేసీబీ వాహనాన్ని ఎస్సై అభిలాశ్ సీజ్ చేశారు.

కాసులు కురిపిస్తున్న మట్టి

ఒక్కో ట్రాక్టర్ మట్టి కట్ట పరిసర గ్రామానికి రూ.300, బయటకు రూ.500 చొప్పున తరలిస్తున్నట్లు తెలిసింది. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల పరిధిలోని గర్శకుర్తి, దేశాయిపల్లి, విలాసాగర్, జగ్గారావుపల్లి, వరదవెల్లి గ్రామాల మీదుగా ఉన్న వరదకాల్వ కట్ట మట్టి మాయమవుతుంది. కట్ట పరిసరాల్లో జేసీబీతో తవ్వేస్తూ టిప్పర్లు, ట్రాక్టర్లలో పోస్తున్నారు. ఇలా రోజుకు వందలాది ట్రిప్పుల మట్టి మాయమవుతోంది. కరీంనగర్ పరిధిలో ఇరిగేషన్‌శాఖ ఉండడంతో ఆ శాఖ అధి కారులు పట్టించుకోవడం లేదు. ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లకు మన ఊరు–మన బడి పనులు అప్పగించడంతో వరదకాల్వ మట్టి తరలింపును ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌గుప్తాను ఫోన్‌లో సంప్రదించగా.. ఆయన అందుబాటులోకి రాలేరు.

ప్రజల మన్ననలు పొందాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మెరుగైన సేవలు అందించడం ద్వారానే ప్రజల మన్ననలు పొందుతామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్, పోలీస్‌స్టేషన్‌లను గురువారం సందర్శించారు. రికార్డులు, 5ఎస్ అమలుతీరు, ఫంక్షనల్ వర్టికల్ అంశాల గురించి తెలుసుకున్నారు. పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఠాణా పరిధిలో పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. డీఎస్పీ విశ్వప్రసాద్, సీఐ మొగిలి, ఎస్సై శేఖర్ ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ: రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్వీ సుభాశ్‌రావు కోరారు. వేములవాడలోని భీమేశ్వరగార్డెన్‌లో గురువారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. బూత్‌కమిటీల నుంచి పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మండలానికి డిగ్రీ కాలేజీ ఏమైందని ప్రశ్నించారు. ప్రతీ మండలానికి 30 పడకల ఆస్పత్రి, రాజన్న గుడికి ఏటా రూ.100 కోట్లు ఏమయ్యాయో ప్రజలకు వివరించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మిడ్‌మానేరు ముంపు గ్రామస్తుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేశ్, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు గోపు బాలరాజు, పట్టణశాఖ అధ్యక్షుడు రేగుల సంతోశ్‌బాబు, నాయకులు ఆడెపు రవీందర్, గోపి, మార్త సత్తయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

పోస్టర్ ఆవిష్కరణ

చందుర్తి(వేములవాడ): వేములవాడలో ఈనెల 5న బద్దిపోచమ్మ తల్లికి యూట్యూబ్, గూగుల్ జానపద కళాకారుల బోనాల పండుగ పోస్టర్‌ను గురువారం చందుర్తిలో ఆవిష్కరించారు. కళాకారులు నాగం పరశురాం, నరావుల గంగస్వామి, జోగినిపల్లి చందు, కుంటల్ల పరశురాం, నాగం బాలశేఖర్, నాగం మురళి, పొన్నం చంద్రమౌళి పాల్గొన్నారు.



చందుర్తిలో బద్దిపోచమ్మ బోనాల పండుగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జానపద కళాకారులు

ప్రపంచ విపంచి పుస్తకావిష్కరణ



సిరిసిల్లకల్చరల్: కవులు, కళాకారులకు జిల్లా కేంద్రం అనాదిగా కాణాచిగా నిలుస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పేర్కొన్నారు. గురువారం గ్రంథాలయ భవనంలో ప్రముఖ కవి, లలితగీతాల రచయిత డాక్టర్ వడ్డేపెల్లి కృష్ణ రచించిన 'ప్రపంచ విపంచి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శంకరయ్య మాట్లాడుతూ వస్తు వైవిధ్యంతోపాటు ఆలాపనకు అనువుగా గజల్స్ రచించారని ప్రశంసించారు. కృతికర్త కృష్ణ మాట్లాడుతూ సినారె స్ఫూర్తితో గజల్లను ప్రభోదాత్మకంగా అక్షరీకరించినట్లు చెప్పారు. ఎలగొండ రవి, వాసరవేని పరశురాం, డాక్టర్ కందేపి రాణీప్రసాద్, వెంగల లక్ష్మణ్, బూర దేవానందం, అంకారపు రవి,పిట్ల నర్సింహులు, చిటికెన కిరణ్ పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి



సిరిసిల్లఅర్బన్: యువత క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు బిహార్‌లో జరిగే ఆలిండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు వెళ్తున్న 13 మందికి ట్రాక్ షూట్లు పంపిణీ చేశారు. సెక్రటరీ బొజ్జ చంద్రశేఖర్, ఆర్గనేజేషన్ సెక్రటరీ సాయికృష్ణ, పీఈటీలు భాను, జ్యోష్ణ, సౌందర్య ఉన్నారు.

ఇసుక వేలం

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లి వద్ద అక్రమంగా నిల్వచేసిన ఇసుకను వేములవాడ రూరల్ పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. ఆ ఇసుకను రెవెన్యూ అధికారులు గురువారం వేలంగా వేయగా.. 11 ట్రిప్పులకు రూ.5,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మల్లారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి వేలంలో పాల్గొని దక్కించుకున్నట్లు ఇంచార్జి తహసీల్దార్ ఎమ్‌డి వహీదొద్దీన్ తెలిపారు. 11 ట్రిప్పుల ఇసుకకు నలుగురు వ్యక్తులు హాజరు కాగా ఒక్కరే టెండర్‌లో పాల్గొని దక్కించుకోవడం అంతా సిండికేట్‌గా ఏర్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వంతెనలు నిర్మించాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): మూలవాగుపై ఉన్న వంతెనలు కొట్టుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటి నిర్మాణాలు వెంటనే చేపట్టాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం కొండాపూర్ శివారులోని పెంటివాగు వద్ద వర్షాలకు కొట్టుకుపోయిన వంతెనను గురువారం పరిశీలించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మూలవాగు ప్రవాహానికి వంతెనలు కొట్టుకుపోతున్నాయన్నారు. ఏటా తాత్కాలిక మరమ్మతులు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలి తం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, గొట్టె రుక్మిణి, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, నాగండ్ల భూమేశ్, లింగారెడ్డి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



పెంటివాగును పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

ఎమ్మెల్యే బాలరాజును సస్పెండ్ చేయాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిరుపేద విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది తన పదవిని కాదనుకొని ప్రజాక్షేత్రంలో తిరుగుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే గువ్వల బాలరాజును బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బాలరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు నీరటి భాను, నాయకులు పాల్గొన్నారు.

'ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జోలికొస్తే సహించం'

సిరిసిల్లటౌన్: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జోలికొస్తే సహించేది లేదని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను హెచ్చరించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. ప్రవీణ్‌కుమార్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే బాలరాజుకు లేదన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్, ఇన్‌చార్జి మ్యాకల మునీందర్, జిల్లా మాజీ అధ్యక్షుడు చాకలి రమేశ్, కార్యదర్శులు బొడ్డు మహేందర్, లింగంపల్లి మధుకర్, యారపు రాజబాబు, కొమురయ్య, అన్నల్‌దాస్ భాను ఉన్నారు.



ఎమ్మెల్యే బాలరాజు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఎస్పీ నాయకులు

విషమించిన అపెండిసైటిస్ ఆపరేషన్

- కరీంనగర్ తరలింపు
- ఆర్థికసాయం కోసం ఎదురుచూపు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలంలోని బావుసింగ్‌తండాకు చెందిన బట్టు విశాల్(8) పదిహేను రోజుల క్రితం కడుపునొప్పితో బాధపడ్డాడు. విశాల్ తల్లిదండ్రులు భారతి–సంతోష్ విశాల్‌ను జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు. ఆస్పత్రిలో వారం రోజులు ఉన్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోగా.. విషమిస్తుండడంతో వారం క్రితం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. బాలుడు ఆరోగ్యం బాగుపడాలంటే కనీసం రూ.7 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక సాయం చేసి తమ కొడుకు ప్రాణాలను కాపాడాలని ఆ నిరుపేద తల్లిదండ్రులు కోరుతున్నారు.

దాతలు సాయం చేయాల్సిన ఫోన్ పే నంబర్ : 97041 55325



కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు